## క్లుప్తంగా

### 'గౌరవ భృతి మంజూరు చేయండి'



కలెక్టర్‌కు వినతిపత్రంను అందిస్తున్న ఎంపీటీసీలు

జి.సిగడాం: తమకు 21 నెలల నుంచి రావాల్సిన గౌరవ భృతి అందజేయాలని జి.సిగడాం మండలం ఎంపీటీలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి గౌరవ భృతి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, కీర్తి తవుడమ్మ, మక్క శ్రీలత, గేదెల వరలక్ష్మి, పట్నాన శాంతి, బూట దమయంతి, కుదిరెళ్ల సూజాత, పరసరాపు మంగమ్మ, తిరుమరెడ్డి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అరసవల్లిలో టెండర్లు నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో వివిధ అంశాలపై సోమవారం ఆలయ మండపాల్లో టెండర్లు నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈవో వై.భద్రాజీ తెలియజేశారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా 14 అంశాలపై టెండర్లు (ఇందులో కొత్తవి 12 అంశాలు) నిర్వహించడం ఇదే తొలిసారి కావడంతో స్థానికంగా ఈ టెండర్లపై అందరి దృష్టి పడింది. పువ్వుల సరఫరా, స్టేషనరీ, కంప్యూటర్ భాగాలు, ప్రసాదం కవర్లు, ప్రసాదం ప్యాకింగ్ స్టాఫ్, పాలు, పెరుగు, ఆకుకూరలు, ప్రింటింగ్, ఎలక్ట్రికల్ మెటీరియల్స్, క్లోక్‌రూం, ప్లంబింగ్ మెటీరియల్, క్లాతింగ్ మెటీరియల్, ప్రోటోకాల్ కోసం స్వామివారి ఫొటోల సరఫరా, గోవుల దాణా సరఫరా తదితర అంశాల్లో హక్కులకు టెండర్లు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి టెండర్ల ప్రక్రియను కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నామని, అలాగే సోమవారం ఉదయం 9.30 గంటల వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తామని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలియజేశారు.

### ఓబీసీ సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర శిష్టకరణ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

గార: ఓబీసీ సాధనే తమ ధ్యేయమని రాష్ట్ర శిష్టకరణ సంఘ అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని చల్లవానిపేట మామిడితోటలో సంఘ సభ్యుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర సామాజిక న్యాయశాఖ పరిధిలో ఉన్న ఓబీసీ సాధన దస్త్రాలు కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదం పొందే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, బలివాడ మల్లేశ్వరరావు, సదాశివుని కృష్ణ, ఎస్‌వీడీ మురళి, ఆర్‌వీఎస్ శర్మ, బలివాడ రాధాకృష్ణమూర్తి, చంద్రమహంతి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

### కుమారరాజుకు సన్మానం



కుమారరాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: ఆరో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా విజయవాడ కేబీఎస్ కళాశాల ఆవరణలో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజును ఘనంగా సన్మానించారు. ఆయన రచించి, గానం చేసిన కవిత పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా ఆయనను సినీ గేయ రచయిత రసరాజు, లెనిన శ్రీనివాస్ తదితరులు ప్రశంసించారు.

### నందికేశ్వరరావుకు సత్కారం



నందికేశ్వరరావుకు సత్కారం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన చంద్రముఖి చంద్రశేఖర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా ప్రపంచ మిమిక్రీ దినోత్సవం హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగింది. దీనిలో భాగంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళావేదికపై జాతీయ మిమిక్రీ కళాకారుడు లోకనాథం నందికేశ్వరరావు ప్రతిభకు పట్టాభిషేకం చేస్తూ ఘనంగా సత్కరించారు. మాజీ ఐఏఎస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో ఈ సత్కారం జరిగింది. ఆయనతో పాటుగా 100 మంది మిమిక్రీ కళాకారులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో జె.అప్పారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదుకోండయ్యా..!



ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు

- అగ్ని ప్రమాద బాధితులకు అందని భరోసా
- గత నెల 23న సంతవురిటిలో ప్రమాదం
- బాధితులకు అందని పరిహారం
- 10 కేజీల బియ్యంతో సరిపెట్టిన వైనం



10 కేజీల బియ్యం అందిస్తున్న అధికారులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో గత నెల 23న అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తలె సంతోష్‌కుమారి, లండ లక్ష్మణ, కోడిగుడ్లు ఆదెమ్మ, కేతుబారిక సోములు, కేతుబారిక అసిరయ్య, కేతుబారిక దాలెమ్మ, కేతుబారిక శంకరరావు, కరజాడ ఈశ్వరరావు, కేతుబారిక శంకరరావు(దాలెప్పడు)ల పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో మొత్తం రూ.12 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. అప్పట్లో కేవలం 10 కేజీల బియ్యం మాత్రమే బాధితులకు ప్రభుత్వం నుంచి అందించారు. అయితే ఈ పది కేజీల బియ్యంతో తాము ఎలా జీవించాలో అర్థంకావడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం బాధితులకు వంట సామాగ్రి, ఇతర ఆర్థిక సాయం ఇంతవరకు మంజూరు చేయలేదు.

అగ్ని ప్రమాదం జరిగి వెంటనే ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరామర్శించి బాధితులకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇన్నిరోజులు గడుస్తున్నా అందాల్సిన సాయం అందలేదు. దీంతో తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

#### ఎదురుచూస్తున్నాం

ప్రభుత్వం మంజూరు చేయాల్సిన ఆర్థిక సాయంతో పాటు వంట సామగ్రి ఇంతవరకు అందించలేదు. అధికారులు, నాయకులు వచ్చి పరామర్శించి వెళ్లిపోయారు. ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు చూస్తున్నాం.

– అదెమ్మ, బాధితురాలు

#### 10 కేజీల బియ్యమే ఇచ్చారు

అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు 10 కేజీల బియ్యం మాత్రమే అందించారు. అంతకుమించి ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదు. కేవలం ఈ పది కేజీల బియ్యంతో మేము ఎలా ముందుకు వెళ్లాలి అనేది అర్థం కావడం లేదు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

– శంకరరావు, బాధితుడు

#### ఆదుకోవాలి



అగ్ని ప్రమాదంలో బాధితులంతా ఎస్సీ కులానికి చెందిన నిరుపేదలే. వారికి ఎటువంటి ఆదాయం లేకపోవడంతో వారంతా కట్టుబట్టలతోనే ఉన్నారు. మా గ్రామస్తులు, యువత, ఇతరుల సహకారంతో కొత్త బట్టలు, సామగ్రిని అందించారు. ప్రభుత్వం తక్షణమే అగ్ని బాధితులకు ఆర్థిక, ఇతర సాయం అందించాలి.

– బుడారి లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్, సంతవురిటి

#### నివేదిక అందించాం



సంతవురిటి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రభుత్వం అన్నివిధాలుగా చేయూత ఇస్తోంది. బాధితులకు అవసరమైన వివిధ రకాల పత్రాలను అందిస్తున్నాం. ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. బాధితుల ఖాతాలకే నగదు జమ అవుతుంది.

– ఎం.శ్రీకాంత్, తహసీల్దార్, జి.సిగడాం

### మన్నయ్యపేటలో స్వచ్ఛభారత్



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్‌లో భాగంగా కె.మన్నయ్యపేట గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విద్యార్థులు ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని కాలువలను పరిశుభ్రం చేసి చెత్త చెదారాన్ని తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

### విద్యార్థుల క్షేత్ర పరిశీలన



శ్రీకాకుళం నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఆదివారం క్షేత్ర పర్యటన చేశారు. జిల్లాలోని ప్రఖ్యాత వంశధార ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణం నుంచి ప్రతీ విషయాన్ని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలబాలికలతోపాటు ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రతినిధులు, సిబ్బంది కూడా ఉన్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ

### అరుణకుమారికి అవార్డు



జి.సిగడాం: మండలంలోని అద్వాన్నంపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కూర్మాన అరుణకుమారికి రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కింది. జనవరి 3వ తేదీన సావిత్రిబాయి పూలే జయింతి సందర్భంగా మేరా భారతీయ చైతన్య యువజన సంఘం అధ్వర్యంలో విజయవాడలో ఈమెకు అవార్డు ప్రధానం చేయనున్నారు. అరుణకుమారి ఆటపాటలతో కూడిన విద్యను అందిచడం, వినూత్నమైన బోధన శైలి, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పించడంతో అవార్డుకు ఎంపిక చేశారు. ఆమెను మండల విద్యాశాఖ అధికారులు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## గంజాయి రహిత సిక్కోలు నిర్మాణమే ధ్యేయం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: గంజాయి రహిత సిక్కోలు నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తులో మునుగుతుండడం బాధేస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువత తమ జీవితాన్ని చేజేతులా అంధకారంలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మత్తు పదార్థాల గురించి, సైబర్ క్రైం గురించి తల్లిదండ్రులు, బంధువులకు, విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ పీవో ఎల్.మోహనరావు, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

శ్రీకాకుళం అర్బన్: మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దామని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఆదివారం శ్రీకాకుళంలో మా శ్రీకాకుళం చిన్నపిల్లల వైద్య సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో 5కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. పోలీస్‌శాఖ కూడా అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తూ గంజాయి సాగును అరికడుతోందని పేర్కొన్నారు. అనంతరం అందరితో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఇటువంటి వినూత్న కార్యక్రమాన్ని శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించినందుకు గాను చిన్నపిల్లల వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు. ముందుగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం నుంచి రామలక్ష్మణకూడలి, సూర్యమహల్ కూడలి, పాలకొండ రోడ్ మీదుగా 5కే వాక్ చేపట్టారు. అనంతరం సాయంత్రం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని బృందావన ఫంక్షన్ హాల్‌లో చిన్నారులతో నృత్య పోటీలు, చిత్రలేఖనం, లఘునాటిక పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య సంఘ ప్రతినిధులు ఎస్.విజయ్‌కుమార్, కె.వినోద్‌కుమార్, వి.శ్రీరామ్మూర్తి, కె.సోమేశ్వరరావు, డి.లక్ష్మీనారాయణ, ఎస్.గుణశేఖరరాజు, ఎస్.జ్యోత్స్న, ఎం.మోహనరావు, ఎస్.జ్యోతిప్రకాశరావు, బి.సాయిరాం, వి.సుచిత్ర, లయన్స్‌క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్, రోటరీక్లబ్, లయన్స్ క్లబ్, జేసీఐ, రెడ్‌క్రాస్, వాకర్స్‌క్లబ్, ఎక్స్ ఆర్మీ, ఎన్‌జీవో బృందాలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ శిక్షణ శిబిరానికి ముగ్గురు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్‌రెడ్డి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి పోటీలకు ముందు జరిగే శిక్షణ శిబిరాలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రాబబుల్స్ పురుషుల జట్టుకు తారకేశ్వరరావు, మహిళల జట్టుకు జి.దుర్గాప్రశాంతి, పి.కల్యాణి ఎంపికయ్యారు. వీరు 2025 జనవరి 3 నుంచి శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. పురుషులకు కర్నూలు జిల్లా ఆలూరులో, మహిళలకు ఒంగోలులో ఈ శిక్షణా శిబిరాలు కొనసాగనున్నాయి. అనంతరం జనవరి 10 నుంచి 14 వరకు తెలంగాణాలోని వరంగల్ జిల్లా వేదికగా జరిగే నేషనల్ మీట్‌లో ఆంధ్రా జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. వీరి ముగ్గురి ఎంపిక లాంఛనమేనని జిల్లా సంఘ ప్రతినిధులు భావిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆదివారం సాయంత్రం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులను ఆశీర్వదిస్తూ.. శిక్షణా శిబిరాలకు, అనంతరం పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. సిక్కోలు ఖ్యాతిని చాటిచెప్పాలని, క్రమశిక్షణ, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో ఆంధ్రా జట్లను విజయపథంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి అర్జున్‌రావు రెడ్డి, కొర్లయ్య, నారాయణరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు

శ్రీకాకుళం కల్చరల్: చిన్నారులకు విలువలతో విద్య అవసరమని సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యాబీఈఏఎస్ రాజు అన్నారు. స్థానిక బాలభాను విద్యాలయంలోని జగద్గురు పీఠంలో సుపథ ప్రతిభ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 21 సంవత్సరాలుగా పద్య పఠనం, శ్లోక పఠనం, వేద పఠనం, దేశభక్తి గేయాలు, క్విజ్, వ్యాస రచనపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ గౌరు నాయుడు మాట్లాడుతూ ఇటువంటి పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవరుతుందన్నారు. శ్రీకాకుళం జగద్గురు పీఠం ఇన్‌చార్జి పీఎస్ఎస్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలపై శిక్షణ ఇవ్వడం వలన సజావుగా గమ్యం చేరాలనుకునే వారికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్యుడు కోన లచ్చునాయుడు, ఎం.జయరాం, పీఎస్ఎస్ నారాయణరావు, కిమ్మి సంతోష్, ఎన్‌డీకే భాస్కరరావు, విష్ణు, శంకరం తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ సంగీత కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆదివారం జరిగాయి. ముందుగా వరదా కమలాకరరావుకు నివాళిగా మృదంగ లయ విన్యాసం ఆకాశవాణి, దూరదర్శన్ ఏ గ్రేడ్ ఆర్టిస్టు మావుడూరు సూర్యప్రసాదరావుచే జరిగింది. వీరికి మండ శ్రీనివాసరావు, చలపరాయి చాణుక్య, గొన్నాభక్తుల బ్రహ్మాజీ, మావుడూరు శ్రీనివాసరావు, మావుడూరు సత్యనారాయణ శర్మలు సహకారాన్ని అందించారు. పిదప అభినయ నృత్యనికేతన్ గురువు టి.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శిష్య బృందంచే భరతనాట్యం, కూచిపూరి నృత్య ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి.మాలతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ఎల్.రామలింగస్వామి, లక్ష్మీగణపతి శర్మ, మార్గదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్ శర్మ

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తలనీలాలను సమర్పించగా.. మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో వై.భద్రాజీ ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, అంతరాలయంలో గోత్రనామాలతో భక్తులకు ప్రత్యేక దర్శనం జరిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. అలాగే మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. ఇదిలావుంటే ఈరోజు వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.59,200, పూజలు, విరాళాల ద్వారా రూ.99,852, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,43,875 వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈవో భద్రాజీ తెలియజేశారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



గార: మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధనరావు

జి.సిగడాం: యువత మాదక ద్రవాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వై.మధుసూదనరావు సూచించారు. స్థానిక స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పల్లెల్లో ఆకతాయిలు బాలికలను ఇబ్బంది పెడితే తక్షణమే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. లేదంటే సచివాలయంలో ఉన్న మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గార: మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్ఐ రెల్ల జనార్ధనరావు అన్నారు. కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామంలో సంకల్పంలో భాగంగా యువతకు ఆదివారం అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం కలిగి ఉంటే అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటూ వస్తున్న ఫోన్లను నమ్మవద్దన్నారు. సైబర్ క్రైమ్ జరిగితే మొదటి గంటలోనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

### లలితాదేవికి ప్రత్యేక పూజలు



లలితాదేవికు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలో దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని లలితాదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలను చేపట్టారు. అలయ అర్చకులు వంశీకుమార్‌శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో శివకామేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో వేంచేసిన లలితా దేవి సమేత శివకామేశ్వరస్వామిని దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా ఆదివారం అలంకరించారు. ముందుగా షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి, నందీశ్వరునికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.

### త్రిపురాన జయంతి నేడు

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురాన రాఘవదాసు 103వ జయంతిని గాంధీ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నం హాజరవ్వనున్నట్లు వెల్లడించారు.